సుబ్బరాయుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

తాగునీటి సమస్య రాకుండా చూడాలి

- సుంకేసుల డ్యామ్‌ను పరిశీలించిన కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు నగరానికి తాగునీటి సమస్య రాకుండా చూడాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ సుంకేసుల డ్యాంను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డ్యాంనీటి నిల్వసామర్థ్యం, గేట్ల నిర్వహణ, ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో వివరాలను ఇరిగేషన్ ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. వేసవికాలంలో కర్నూలు నగరానికి తాగునీటి కొరత రాకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. డ్యాంకు ఏవైనా మరమ్మతులు అవసరమైతే తమ దృష్టికి తీసుకురావాలని, ప్రభుత్వానికి పంపించి తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. భారీ వర్షాల కారణంగా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తూ వివరాలను తమకు తెలపాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. మునగాలపాడు సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను పరిశీలించారు. స్టోరేజ్ సామర్థ్యం,.ఇతర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్టోరేజ్ సామర్థ్యం 0.15 టీఎంసీగా ఉందని, 1998 సంవత్సరంలో నిర్మించబడిందని తెలిపారు. గతంలో ఈ ట్యాంక్ ద్వారా కర్నూలు నగరానికి దాదాపు నాలుగు నెలలపాటు తాగునీరు సరఫరా చేసేవారని, జిల్లా కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ, ఇరిగేషన్ ఎస్ఇ బాలచంద్రారెడ్డి, హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఇ పాండురంగయ్య, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ మనోహర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మనోహర్, తహశీల్దార్ (అర్బన్) రమేష్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సుంకేసుల డ్యామ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ సిరి, అధికారులు

ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి లేకపోతే చర్యలు

ఇళ్ళ నిర్మాణాల్లో పురోగతి సాధించాలని, పురోగతి సాధించని వారిపై చర్యలు ఉంటాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి అధికారులను హెచ్చరించారు. గురువారం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి హౌసింగ్ అంశంపై కలెక్టర్ సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ... జిల్లాలో హౌసింగ్ డిపార్టుమెంటుకు సంబంధించి లబ్ధిదారులు ఇచ్చిన ఐవిఆర్ఎస్ సమాధానాలు సంతృప్తికరంగా లేవని పేర్కొన్నారు. లబ్ధిదారులకు ఇళ్లు కట్టుకోవడానికి ప్రభుత్వం తరపున అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని స్టేజ్ వారీగా సరిగా అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వార్డ్ అమెనిటిస్ సెక్రటరీలు లబ్ధిదారులకు అందుబాటులో ఉండి, గృహ నిర్మాణంలో సహాయ సహకారాలు అందించి, ఇళ్ళ నిర్మాణాలు పూర్తి అయ్యేలా చూడాలన్నారు. అలా చేయకుంటే వారిపై చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. స్టేజ్ ప్రకారం బిల్లులు సకాలంలో అప్లోడ్ చేయాలన్నారు. మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు, హౌసింగ్ అధికారులు సమస్యలు లేకుండా, గృహాలు త్వరగా పూర్తి అయ్యేలాగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఆదోనిలో కుప్పగల్,ఆలూరు లో ఆలూరు-4, చిప్పగిరిలో దౌలతాపురం, దేవనకొండలో పొట్లపాడు, మద్దికేర మండలంలో పెరవళి, ఓర్వకల్ మండలం ఓర్వకల్ సచివాలయం,తుగ్గలి మండలం జొన్నగిరి వెల్దుర్తి మండలం రామళ్లకోట, ఎమ్మిగనూరులో ఎన్‌టిఆర్ కాలనీలలో ఇళ్ళ నిర్మాణాల్లో వెనుకబడి ఉన్నారని, పురోగతి సరిగా లేదని, పనితీరు మెరుగుపరుచుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పిఎంఎవై గ్రామీణ్ కింద అర్హత గల లబ్ధిదారులను ఎంపిక చేసేలా నవంబర్ 5వ తేదీ లోపు సర్వే నిర్వహించాలని కలెక్టర్ ఎంపిడిఒలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. హౌసింగ్ పిడి చిరంజీవి, ఎంపిడిఒలు, హౌసింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు స్మార్ట్ సిటీ ప్రణాళిక తయారు చేయండి

అధికారులకు కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి సూచన

కర్నూలును స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దడానికి ప్రణాళికను రూపొందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి మునిసిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్‌లో కర్నూలు స్మార్ట్ సిటీకి సంబంధించికలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. స్మార్ట్ సిటీ గా తీర్చిదిద్దేందుకు చేపట్టాల్సిన పనులపై జాయింట్ కలెక్టర్, ఇతర శాఖల అధికారులతో చర్చించారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ రోడ్ల అభివృద్ధి, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ సిస్టమ్, నీటి సరఫరా వ్యవస్థ, పార్కుల అభివృద్ధి తదితర అంశాలకు సంబంధించి పూర్తి వివరాలతో యాక్షన్ ప్లాన్ రూపొందించాలని ఆదేశించారు. అభివృద్ధి పనుల కోసం కేంద్ర ప్రభుత్వ పథకాలు, ఇతరత్రా ఏ విధంగా నిధులను వినియోగించుకోవచ్చో కూడా ఈ యాక్షన్ ప్లాన్‌లో పొందుపరచాలని కలెక్టర్ మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్, మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ, ఆర్అండ్‌బి ఎస్ఇ మహేశ్వర్ రెడ్డి, కర్నూలు నగర పాలక సంస్థ ఇంచార్జ్ ఎస్ఇ. శేష సాయి, ఇతర సిబ్బంది, నేషనల్ హైవే అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతునన కలెక్టర్ సిరి

సీమ ప్రాజెక్టుల సాధనే నిజమైన నివాళి

- రిటైర్డ్ ఇంజినీర్ సుబ్బరాయుడు సంస్మరణ సభలో వక్తలు

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్

రాయలసీమ ప్రాజెక్టుల సాధనకు పోరాటం చేయడమే రిటైర్డ్ ఇంజనీర్ సుబ్బారాయుడుకు మనమిచ్చే నిజమైన నివాళి అని వక్తలు అన్నారు. రాయలసీమ ముద్దుబిడ్డ నీటి రంగ నిపుణులు రిటైర్డ్ ఇంజనీర్ సుబ్బరాయుడు సంస్మరణ సభ నేడు కర్నూలులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించారు. రాయలసీమ సాగునీటి సాధన సమితి, రాయలసీమ విద్యావంతుల వేదిక, కర్నూలు జిల్లా జలసాధన సమితి సంయుక్తంగా నిర్వహించిన ఈ సంస్మరణ సభకు శేషాద్రిరెడ్డి అధ్యక్షత వహించారు. వివిధ పార్టీల, ప్రజా సంఘాల నాయకులు సుబ్బరాయుడు చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన రాయలసీమ ప్రాజెక్టుల కోసం చేసిన కృషిని కొనియాడారు. నాయకులు మాట్లాడుతూ, సుబ్బారాయుడు ఎన్నో ప్రాజెక్టులకు పథకాలు రూపొందించారన్నారు. సిద్ధేశ్వరం అలుగు, వేదవతి ప్రాజెక్టు, గుండ్రేవుల రిజర్వాయర్, ఆర్‌డిఎస్‌కుడి కాలువలకు మాత్రమే కాకుండా అనేక నీటి పారుదల పథకాలను రూపశిల్పి అన్నారు. తన ఆరోగ్యాన్ని కూడా లెక్కచేయకుండా వాటి అమలు కోసం జీవితాంతం కృషి చేశారని కొనియాడారు. ఆయన రాయలసీమ ప్రజల ఇంజనీర్ అని అన్నారు. కరువులు, వలసలు, రైతుల ఆత్మహత్యలు లేని రాయలసీమ కోసం పరితపించిన వ్యక్తి అని, సీమ ఉద్యమానికి ఆయన మార్గదర్శిగా, ఆయన పథకాలు కరదీపికల వలే ఉన్నాయన్నారు. ఆయన చూపించిన పథకాల అమలు కోసం ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావలసిన బాధ్యత రాయలసీమ ప్రజలపై ఉందన్నారు. అదే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. రామకృష్ణారెడ్డి, రైతు సంఘం నాయకులు జగన్నాథం, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి.రాముడు, జన విజ్ఞాన వేదిక జాతీయ నాయకులు డాక్టర్ బ్రహ్మారెడ్డి, విరసం బాధ్యులు పాణి, రాయలసీమ విద్యావంతుల వేదిక నాయకులు రత్నం ఏసేపు, ఆదినారాయణ రెడ్డి, రైతుకూలీ సంఘం నాయకులు సుంకన్న, ప్రజా అభ్యుదయ సంస్థ నాయకులు యోహాన్, డేవిడ్, నరహరి, విద్యార్థి సంఘం నాయకులు సీమకృష్ణ, సుదర్శన్‌రెడ్డి, ఇంజనీర్ సుబ్బారాయుడు కుమారులు శ్రీనివాస్ ప్రసంగించారు.

మారని జిజిహెచ్ పార్కింగ్ సమస్య

-మాటలకే పరిమితమైన అధికారుల తీరు
-సెక్యూరిటీ ఏజెన్సీ మారినా ఫలితం శూన్యం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు పార్కింగ్ సమస్య వేధిస్తోంది. జిజిహెచ్‌కు రోజుకు రోగులు, రోగుల సహాయకులు, డాక్టర్స్, వైద్య విద్యార్థుల వాహనాలు వేలాదిగా వస్తుంటాయి. జిజిహెచ్‌లో సరైన పార్కింగ్ సౌకర్యం లేక వాహనాలను రోడ్డుపైనే పార్కింగ్ చేయడంతో వాహనాల రాకపోకలు, రోగుల తరలింపునకు ఆటంకంగా మారుతున్నాయి. పార్కింగ్ ఏదో ఒక సరైన పరిష్కారం మార్గం చూపుతామన్న జిజిహెచ్ అధికారుల మాటలు చెబుతున్నా పరిస్థితిలో మాత్రం మార్పు రావడం లేదు. గురువారం గ్యాస్ట్రోఎంట్రాలజీ విభాగం, సర్జికల్ విభాగం ముందు రోడ్డుపైనే ద్విచక్ర వాహనాలను, కార్లను రోడ్డు పైనే పార్కింగ్ చేయడంతో జిజిహెచ్ వచ్చి వెళ్లే వాహనాలతో కొంతసేపు ట్రాఫిక్ జామ్ అయింది. రోగులు డాక్టర్స్ అవస్థలుపడ్డారు. హాస్పిటల్ ప్రాంగణంలో ట్రాఫిక్ జామ్‌అయి ఇబ్బంది పడుతున్నా క్లియర్ చేయడానికి అక్కడ ఒక సెక్యూరిటీ గార్డ్ లేకపోవడం కొసమెరుపు. సరైన ప్రదేశంలో పార్కింగ్ చేయించాల్సిన సెక్యూరిటీ ఏజెన్సీ ఆ పని చేయకపోవడంతో వాహన దారులు రోడ్డు పైన పార్క్ చేయడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా జిజిహెచ్ అధికారులు పార్కింగ్ సమస్య లేకుండా చేయాలని రోగుల సహాయకులు అభిప్రాయ పడుతున్నారు.

ట్రాఫిక్‌తో ఇబ్బందులు పడుతున్న రోగుల బంధువులు, ఆస్పత్రి సిబ్బంది

ఆర్‌యు పరీక్ష కంట్రోలర్‌ను తొలగించండి

- వీసీకి ఎస్ఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ యూనివర్సిటీ పరీక్షా విభాగం కంట్రోలర్‌ను తొలగించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రంగప్ప, యూనివర్శిటీ కన్వీనర్ రామకృష్ణ విసిని డిమాండ్ చేశారు. గురువారం రాయలసీమ యూనివర్సిటీ ఉపకులపతి వెంకట బసవరావును ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగప్ప, వర్సిటీ కన్వీనర్ రామకృష్ణ ప్రొఫెషనల్ స్టూడెంట్ కన్వీనర్ అమర్‌బాబు, సందీప్ నాయక్, మనోహర్, మనోజ్ ప్రదీప్, రామంజి లు కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో అనేకమంది విద్యార్థుల జీవితాలతో పరీక్షా విభాగం కంట్రోలర్ నిర్లక్ష్యం కారణంగా విద్యార్థుల భవిష్యత్తు తీవ్రంగా కుంటుపడుతుందని దీని ద్వారా విద్యార్థుల భవిష్యత్తు నాశనం అవుతుందని విసికి వివరించారు. గతంలో అనేకసార్లు పరీక్షా పేపర్ లీకేజీలు జరిగినా కూడా పరీక్ష విభాగం కంట్రోలర్‌పై చర్యలు తీసుకోకుండా గత పాలకులు నిర్లక్ష్యం వహించారన్నారు. విద్యార్థులు సంబంధించిన పరీక్షా ఫలితాల విషయాల్లో తీవ్రంగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని,సర్టిఫికెట్ల మంజూరు విషయంలో విద్యార్థులను చులకనగా మాట్లాడుతూ తీవ్ర అవమానాలకు గురి చేస్తున్నారని తెలిపారు. పరీక్షా ఫీజులు కట్టే సమయంలో సంబంధిత కాలేజీలు విద్యార్థుల సమస్యలను మెయిల్స్ ద్వారా, కాల్స్ ద్వారా వివరించిన వాటికి రెస్పాండ్ అవ్వకుండా విద్యార్థులను ఫీజులు కట్టించుకోవడంలో తీవ్రంగా విఫలమయ్యారన్నారు. అనంతరం విద్యార్థులతో కావాలని ఫైన్‌తో ఫీజులు కట్టిస్తూ విద్యార్థులను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు.కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ పై అనేక అవినీతి ఆరోపణలపై గతంలో ఉన్నటువంటి అధికారులు కమిటీలు వేశారని ఆ కమిటీలు అలానే మూలన పడ్డాయన్నారు. వెంటనే అవినీతి చేసిన చిట్టాలను బయటపెట్టి విద్యార్థులకు అన్యాయం చేస్తున్న పరీక్ష విభాగం కంట్రోలర్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలకు శ్రీకారం చుడుతామన్నారు. అవసరమైతే చలో యూనివర్సిటీకి పిలుపునిస్తామని హెచ్చరించారు.

వీసీకి వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

రాష్ట్రస్థాయికి ఎంపికయిన క్రీడాకారులను అభినందిస్తున నగరూరు శమంతకమణి

బంగారు పతకాలతో రండి

మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ శమంతకమణి

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

అనంతపురంలో జరిగే రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలలో మంచి ప్రతిభ చూపించి బంగారు పతకాలు తీసుకు రావాలని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ శమంతకమణి సూచించారు. అనంతపురంలో ఈనెల 25, 26 తేదీలలో జరిగే రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలలో పాల్గొనే క్రీడాకారులకు ఆమె ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరూరు సుబ్రహ్మణ్యం ట్రస్ట్ ద్వారా క్రీడాకారులకు ఆర్థిక సహాయ సహకారాలు అందజేస్తున్నామన్నారు. కర్నూలు క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం హర్షదాయకమని అన్నారు. నేటి సమాజంలో ఆత్మరక్షణకు క్రీడలలో ప్రతి విద్యార్థి సాధన చేయాలని అన్నారు. టి వెంకటేశ్వర్లు, టి అజయ్, మధుకుమార్, సతీష్ కుమార్, నాగరాజు, కె.వెంకటేష్, మునీర్, కృష్ణవంశీ, విశ్వాసరావు పాల్గొన్నారు.

పట్టణ సమస్యలపై నేడు ఓపెన్ ఫోరం

-నగరపాలక సంస్థ కమిషనర్ పి. విశ్వనాథ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : కర్నూలు నగరంలో పౌరుల సమస్యలను ప్రత్యక్షంగా విని, తక్షణ పరిష్కారానికి చర్యలు చేపట్టేందుకు శుక్రవారం 'ఓపెన్ ఫోరం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ పి.విశ్వనాథ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు ఎస్‌బిఐ ఉద్యోగుల కాలనీ మున్సిపల్ కౌన్సిల్ హాలులో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించిన నిర్మాణ అనుమతులు సేవలలో తలెత్తుతున్న ఇబ్బందులపై పౌరులు తమ సమస్యలను నేరుగా చెప్పవచ్చన్నారు. పౌరుల ఫిర్యాదులను వెంటనే నమోదు చేసి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశిస్తామని కమిషనర్ తెలిపారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

'జిబిఎల్ -యుకె ట్రస్టు' ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-సి బెళగల్



బురాన్ హైస్కూల్‌లో జిబిఎల్ - యుకె ట్రస్టు వారి సారథ్యంలో గురువారం హెచ్‌ఎం హకీమ్‌బాషా విద్యార్థులకు ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో పలువురు విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కంటి చూపు తక్కువగా ఉన్నవారికి అద్దాలు ఇస్తామని ట్రస్టు పేర్కొంది. ఇంకా కంటి జబ్బుల తీవ్రత కలిగిన విద్యార్థులకు నాణ్యమైన వైద్యం అందిస్తామని ఈ సందర్భంగా మీడియాకు తెలిపారు.

కనిపించని పోలియో కేసులు

నేడు ప్రపంచ పోలియో దినోత్సవం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ప్రతి సంవత్సరం అక్టోబర్ 24న ప్రపంచవ్యాప్తంగా 'పోలియో దినోత్సవం (వరల్డ్ పోలియో డే)' నిర్వహిస్తారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుఎహెచ్ఒ) ఆధ్వర్యంలో ఈ పోలియో దినోత్సవం పోలియో వైరస్ నిర్మూలనకు ప్రజల్లో అవగాహన కల్పించడమే లక్ష్యంగా నిర్వహిస్తారు. పోలియో అనేది ప్రధానంగా ఐదేళ్ల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలను ప్రభావితం చేసే తీవ్రమైన, వికలాంగులను చేసే, ప్రాణాంతక వైరల్ వ్యాధి. పోలియోకు చికిత్స లేదు. కానీ టీకాల ద్వారా దీనిని పూర్తిగా నివారించవచ్చు. ఈ దినోత్సవం టీకాల ప్రాధాన్యతను నొక్కి చెబుతుంది. నిర్మూలన ప్రయత్నాలను హైలైట్ చేయడం, మద్దతును సమీకరించడం జరుగుతుంది. మన దేశంలో ప్రభుత్వం విధిగా అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్లలోపు ప్రతి చిన్న పిల్లలకు 6,10,14 వారాలలో, 15-18 నెలల మధ్యలో 5 సంవత్సరాలలో పోలియో చుక్కలు వేయిస్తారు. 6,14 వారాలలో పోలియో టీకాలు వేయడం ద్వారా పోలియో కేసులు నమోదు కావడం లేదు. భారతదేశం 2014లో పోలియో రహిత దేశంగా గుర్తింపు పొందింది. అయితే వైరస్ మళ్లీ ప్రవేశించే ప్రమాదం ఉండటంతో జాగ్రత్త చర్యలు నిరంతరం కొనసాగుతున్నాయి. ఐదేళ్ల లోపు ప్రతి చిన్నారికి పోలియో డ్రాప్స్ వేయించే కార్యక్రమాన్ని ప్రతి ఏడాది నిర్దేశిత ప్రణాళిక ప్రకారం నిర్వహిస్తున్నారు.

1988లో గ్లోబల్ పోలియో ఎరాడికేషన్ ఇనిషియేటివ్ (జిపిఇఐ) ప్రారంభించినప్పటి నుండి పోలియో కేసుల్లో 99శాతం పైగా తగ్గుదల వంటి అద్భుతమైన పురోగతిని నేడు సాధించారు. వైరస్‌ను పూర్తిగా భూమి నుండి తొలగించడానికి నిధులు, రాజకీయమద్దతు, నిరంతర ప్రయత్నాల అవసరాన్ని ఈదినం గుర్తు చేస్తుంది.

పోలియోప్రపంచవ్యాప్తంగా దాదాపుగా నిర్మూలించినప్పటికీ ప్రస్తుతం ఆఫ్ఘనిస్తాన్ , పాకిస్తాన్ వంటి కొన్ని దేశాలలో మాత్రమే స్థానికంగా ఉంది. చివరి కేసులు ఉన్నంతవరకు, టీకాలు వేయని జనాభాకు వ్యాధి తిరిగి వచ్చే ప్రమాదం ఉంది. ఈ ముప్పుపై అవగాహన కల్పించడం దీని లక్ష్యం. ఈ దినోత్సవాన్ని రోటరీ ఇంటర్నేషనల్ స్థాపించింది. ఇది పోలియోకు వ్యతిరేకంగా తొలి టీకా (ఐవిపి) అభివృద్ధి చేసిన బృందానికి నాయకత్వం వహించిన డాక్టర్ జోనాస్ సాల్క్ జన్మదినాన్ని పురస్కరించుకుని పోలియోడేను జరుపుకుంటారు.

జిల్లాలో పోలియో కేసులు రావడం లేదు

డాక్టర్ విజయ ఆనందబాబు, పీడియాట్రిక్స్ హెచ్ఒడి

ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు 6, 10, 14, వారాలు, 15 -18 నెలల మధ్య, ఐదేళ్లలో పోలియో చుక్కలు వేయిస్తాం. 6,14 వారాలలో పోలియో టీకాలు వేయించాలి. ప్రస్తుతం మన దగ్గర పోలియో కేసులు నమోదు కావడం లేదు. అయినా జాగ్రత్తలు పాటించాలి. పోలియో వైరస్ వుంటే కలుషిత నీరు, అపరిశుభ్రతతో వున్న చేతుల ద్వారా కలుషిత ఆహారం తీసుకోవడం ద్వారా తిరిగి పోలియో రావడానికి అవకాశం ఉంటుంది. కనుక పిల్లలు శుభ్రంగా చేతులు కడుక్కోవడం దుమ్ము దూళీలో ఆటలాడుతూ ఉంటే స్నానం చేయించాలి. ఇలా చేయడం ద్వారా వైరస్‌ను అరికట్టవచ్చు. పోలియో ఉండే దేశాల నుంచి వచ్చేవారిని ప్రభుత్వం సర్వేలెన్స్ చేపడుతుంది.

సురక్ష యాప్‌పై అవగాహన

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

సురక్ష యాప్ పై ఎక్సైజ్ పోలీసులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించామని కర్నూలు జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి ఎం.సుధీర్ బాబు తెలిపారు. కర్నూలు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్‌ల పరిధిలోని మొత్తం వైన్ షాపులు, బార్లు మొత్తం అమ్మకాలు రూ. 2, 32 , 30 , 335 అందులో 1,43,346 బాటిల్లను స్కాన్ చేసి ఈ మొత్తం అమ్మకాలు అయ్యాయని ఎం.సుధీర్ బాబు తెలిపారు. సురక్ష యాప్ పై గురువారం ఎక్సైజ్ పోలీసులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. యాప్ వినియోగించే విధానాల్ని తెలిపే పోస్టర్లను విడుదల చేశారు. వినియోగదారులకు సురక్ష యాప్ అందుబాటులో ఉంచడం నిమిత్తం ప్రభుత్వం వారు ప్రతి ఒక్క షాపులో క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటు చేసి ఒక కార్డు బోర్డును ప్రతిషాపు ముందు ఏర్పాటు చేశామన్నారు. వినియోగదారులు అందరికీ కూడా అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి సురక్ష యాప్‌ను ఉపయోగించడం వలన మద్యం నాణ్యతను తెలియజేయుటకు ఉపయోగపడుతుందని చెప్పారు. ప్రతి వినియోగదారుడు సదరు మద్యం బాటిల్ ఎక్కడి నుంచి వచ్చిందన్నది సులభంగా తెలుసుకొనుటకు వీలు కలిగే విధంగా సురక్ష యాప్ ను ప్రతి షాపులో అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ప్రతి ఒక వినియోగదారుడు క్యూఆర్ కోడ్ ను ఉపయోగించుకొని యాప్ ద్వారా మద్యం నాణ్యత , ఎక్కడి నుంచి వచ్చినది పూర్తి వివరాలు తెలుసుకునే అవకాశం కల్పించామన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొహిబిషన్ , ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆర్ రామకృష్ణారెడ్డి, ఇన్‌స్పెక్టర్ చంద్రహాస్, సబ్ ఇన్‌స్పెక్టర్ దుర్గా నవీన్‌బాబు, సిబ్బంది వినియోగదారుడికి యాప్‌ఎలా ఉపయోగించుకోవాలి అనే విధి విధానాలను తెలిపారన్నారు. కస్టమర్లు ఉత్సాహంగా ప్లే స్టోర్‌కి వెళ్లి యాప్ ను డౌన్లోడ్ చేసుకొని తాను కొన్న బాటిల్ సరియైనదే అని నిర్ధారణ చేసుకున్నారని వివరించారు.

డిఎంహెచ్ఒ డాక్టర్ శాంతికళ బదిలీ

ఇన్‌ఛార్జి డిఎంహెచ్ఒగా డాక్టర్ ఎల్. భాస్కర్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.శాంతి కళ గురువారం బదిలీపై గుంటూరుకు వెళ్లారు. గత ఏడాది డిసెంబర్‌లో డి ఎంహెచ్‌ఒగా పదోన్నతి పొంది కర్నూలుజిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా వచ్చారు. వ్యక్తిగత కారణాలతో బదిలీపై గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఆఫ్‌హెల్త్‌కు బదిలీపై వెళ్లారు. ఇన్చార్జి డిఎంఅండ్ హెచ్ఒ (ఎఫ్ఎసి) గా జిల్లా టిబి ఎయిడ్స్ లెప్రసీ నియంత్రణ అధికారి డాక్టర్ ఎల్.భాస్కర్ గురువారం భాద్యత తీసుకున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే తొలి ప్రాధాన్యత

డయల్ యువర్ కమిషనర్‌కు 36 ఫిర్యాదులు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నగర ప్రజల సమస్యల పరిష్కారానికే తొలి ప్రాధాన్యత ఇవ్వాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన 'డయల్ యువర్ కమిషనర్'కు మొత్తం 36 ఫిర్యాదులు వచ్చాయి. ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను సంబంధిత విభాగాధికారులు నమోదు చేసుకుని, పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్‌కుమార్‌రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ఎంఇలు శేషసాయి, మనోహర్‌రెడ్డి, ఆర్ఒజునైద్, డిసిసి వెంకటరమణ, పారిశుధ్య పర్యవేక్షక అధికారినాగరాజు, సూపరింటెండెంట్లు సుబ్బన్న, వాజిద్, మంజూర్‌బాష తదితరులు పాల్గొన్నారు.

నడవలేని స్థితిలో శ్రీరంగాపురం , రామళ్లకోటరోడ్లు

నగేష్ సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు

ప్రజాశక్తి -వెల్దుర్తి

వెల్దుర్తి మండలం శ్రీరంగాపురం , రామళ్లకోట గ్రామాలలో భారీగా గుంటలు పడి ప్రజలు, ముఖ్యంగా వాహనదారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు నగేష్ ఒక ప్రకటనలో తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు గడిచినా కనీసం సిసి రోడ్లు కూడా వేయించలేని స్థితిలో ఉందా అని ప్రశ్నించారు?. రోడ్డులో ప్రయాణిస్తున్న వాహనదారుల వాహనాలు చెడిపోవడం, టూ వీలర్‌లో వెళ్తున్న వాహనదారులు బురదలో పడి దెబ్బలు తగిలించుకుంటున్నారని తెలిపారు. అత్యవసరమైన అంబులెన్స్, గ్యాస్, సివిల్ సప్లయ్‌కి సంబంధించిన బియ్యం వాహనాలు వెళ్లలేని పరిస్థితిలో రోడ్లు మారాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జిల్లాలో ఉన్న ఆర్అండ్‌బి శాఖ మంత్రి మాట్లాడుతూ రోడ్లన్నీ బాగుచేస్తామని ప్రకటించారని గుర్తు చేశారు. ఇప్పటికైన వెంటనే శ్రీరంగాపురం, రామళ్లకోట గ్రామాలలో సిసి రోడ్లను, డ్రెయినేజీ నిర్మాణాలను చేపట్టాలని డిమాండ్ చేశారు. తెలుగుదేశం నాయకులు ప్రజలకు మేలు చేస్తామని కనీసం రోడ్లు కూడా వేయించలేకపోతున్నారని విమర్శించారు.

మార్కెట్‌ను పరిశీలిస్తున్న నాయకులు

వ్యవసాయ మార్కెట్‌లో సౌకర్యాలు కరువు

- రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు

ప్రజాశక్తి - ఆదోని రూరల్

ఆదోని వ్యవసాయ మార్కెట్ కమిటీకి రైతు వ్యవసాయ ఉత్పత్తుల ద్వారా రూ.కోట్ల ఆదాయం వస్తున్నా.. వ్యవసాయ ఉత్పత్తులను వర్షం నుంచి కాపాడడానికి సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం, అధికార యంత్రాంగం విఫలమవుతున్నాయని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు విమర్శించారు. గురువారం ఆదోని మార్కెట్ యార్డులో పత్తి నిల్వ చేసే ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సరైన షెడ్లలో సరైన సిస్టం లేకపోవడంతో షెడ్లల్లోకి నీరు చేరి పత్తి పూర్తిగా తడిసిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. నీళ్ల రాకుండా చూడడంలో ప్రభుత్వం, అధికారులు పూర్తిగా విఫలమయ్యారని, ప్రభుత్వాలు సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేకపోతే రైతులను సమీకరించి మార్కెట్ యార్డు కార్యాలయం, వ్యవసాయ కార్యాలయాల ముందు ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. పత్తి రైతులు పాల్గొన్నారు.

కార్మిక హక్కుల పరిరక్షణకు కృషి

- జిల్లా మహాసభలను జయప్రదం చేయండి : సిఐటియు

ఎమ్మిగనూరులో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

కార్మిక హక్కుల పరిరక్షణకు సిఐటియు నిరంతరం కృషి చేస్తోందని సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు పి.గోవిందు, బి.రాముడు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని సుందరయ్య భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈనెల 25, 26వ తేదీల్లో కర్నూలు నగరంలోని కార్మిక, కర్షక భవన్‌లో జరిగే సిఐటియు 13వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. సిఐటియు నాయకులు ప్రవీణ్, జె.నాగరాజు, కె.ఇస్మాయిల్, సి.నారాయణ, గౌసియా, లతా, రాణి, శివలక్ష్మి, శిరోమణి, గోరుబాష, కేశన్న, పి.రాజు, కెఎం.బాష, ఎం.జావిద్, షఫీ, ఎస్ఎం.మహ్మద్, హుస్సేన్ పాల్గొన్నారు. **దేవనకొండ**లోనిహమాలీ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు పాండురంగడు, ముకెళ్ల అశోక్ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక సంక్షేమాన్ని విస్మరించి పెట్టుబడుదారుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ ఒత్తిడితో రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల 8 గంటల పని విధానం స్థానంలో 12 గంటల పని విధానాన్ని తీసుకొస్తుందని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను రద్దు చేసి వాటి స్థానంలో లేబర్ కోడ్‌లు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై కార్మికులు ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని కోరారు. ఈ మహాసభలకు కర్నూలు మాజీ ఎమ్మెల్యే, సిఐటియు రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఎంఎ.గఫూర్, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరావు, రాష్ట్ర కార్యదర్శి అజయ్ కుమార్ పాల్గొంటారని తెలిపారు.

రబీకి నీరివ్వాలి : రైతుసంఘం

ప్రజాశక్తి - హోళగుంద

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తుంగభద్ర డ్యామ్ నుంచి ఆంధ్రా వాటాకు వచ్చే ఎల్ఎల్‌సి కాలువ నీటిని రబీ పంటలకు ఇవ్వాలని రైతుసంఘం నాయకులు తప్పెట రామిరెడ్డి కోరారు. గురువారం బళ్లారిలోని టిబిపి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయం వద్ద రైతులతో కలిసి మాట్లాడారు. ఇప్పటికే కురిసిన అధిక వర్షాలకు ఖరీఫ్ పంట దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. రబీ పంటకు తుంగభద్ర బోర్డు అధికారులు ఆంధ్రా వాటా కింద ఇవ్వాల్సిన నీరు ఇవ్వకపోతే రైతులు మరితత నష్టపోతారని వాపోయారు. అనంతరం తుంగభద్ర బోర్డు ఎస్ఇ నారాయణ నాయక్ దృష్టికి తీసుకెళ్లగా... నవంబర్ 7న తుంగభద్ర బోర్డు అధికారుల సమావేశంలో రబీ పంటకు ఆంధ్రాకు సాగు, తాగునీరు అందించే విషయంపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అనంతరం ఎస్ఇకి వినతిపత్రం అందించారు. కర్ణాటక రైతుసంఘం నాయకులు శరణ గౌడ, ఆంధ్రా రైతులు రమేష్ రెడ్డి, కురువ కాళికా ప్రసాద్, కృష్ణయ్య, మిక్కిలినేని మహేష్, కాకి సీతయ్య, కాకి పక్కీరప్ప, దిడ్డి వెంకటేష్, దుబ్బ ఎర్రిస్వామి పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం...!

- నేలవాలిన వరి, పత్తి పంటలు - ఇబ్బందుల్లో రైతులు

ప్రజాశక్తి - కౌతాళం

అకాల వర్షాలు అన్నదాతను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. అల్పపీడన ప్రభావంతో పర్యదిన తుపాను, గాలికి, వర్షాలకు వరి, పత్తి సాగు చేసిన రైతులు విలవిల్లాడుతున్నారు. పంటలు చేతికొచ్చిన దశలో తుపాను, గాలి బీభత్సానికి వరి పంట నేలకొరిగింది. పత్తి పంట తడిసి ముద్దయింది. అన్నదాతలు నష్టాల పాలవుతున్నారు. ఎన్నో ఆశలతో వ్యవసాయం చేసిన రైతులకు పెట్టిన పెట్టుబడులు కూడా రాక అప్పులు మిగిలే పరిస్థితులు నెలకొన్నాయి. ఈసారి అధిక వర్షాలు, తుపాను కారణంగా 70 శాతం పంటలు దెబ్బతిని రైతులకు కష్టాలతో పాటు నష్టాలు మిగిలాయి.

జిల్లాలోని పశ్చిమ ప్రాంతం మంత్రాలయం నియోజక వర్గం కౌతాళం మండలంలో మూడు రోజుల నుంచి గాలి వాన బీభత్సం సృష్టిస్తోంది. మండలంలో 75 వేల ఎకరాల్లో రైతులు వివిధ పంటలను సాగు చేశారు. పత్తి పంటంతా తడిసి ముద్దయింది. పత్తి పంట 57 వేల ఎకరాలు, వరి 5,200 ఎకరాలు, మిరప 3 వేల ఎకరాల్లో రైతులు సాగు చేశారు. అధిక వర్షాలతో పత్తి, మిరప, వరి పంటలు దెబ్బ తిన్నాయి. ఇటీవల తుపాను, గాలికి వరి పంట నెలకొరిగింది.

చేతికొచ్చిన పంటలు.. రైతులకు అందకుండానే..!

మండలంలో తుంగభద్ర దిగువ కాలువ కింద రైతులు వరి పంట సాగు చేశారు. తుంగభద్ర పరివాహక ప్రాంతాలైన మేళిగనూరు, నదీచాగి, కుమ్మాలనూరు, కుమ్మాలనూరు క్యాంపు, మురళి, గుడికంబాలి, వల్లూరు గ్రామ రైతులు అధికంగా వరి పంటను సాగు చేశారు. ఎకరాకు దాదాపు రూ.40 వేల పెట్టుబడులు పెట్టారు. వరి పంట మరో 20 రోజుల్లో కోతకు వచ్చేది. ఈ దశలో తుపాన్, గాలికి పంటంతా నేలవాలింది. వరి గింజలు రాలి, తడిసి పంట దెబ్బతినడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పత్తి రైతుల దుస్థితి..!

పత్తి పంట సాగు చేసిన రైతుల పరిస్థితి అధ్వానంగా ఉంది. గత నెలలో కురిసిన భారీ వర్షాలకు పత్తి కాయలు రాలిపోయాయి. మిగిలిన కొద్దిపాటి పంట కూడా చేతికి వచ్చే సమయంలో తుపాను కారణంగా భయం రైతులను వెంటాడుతోంది. పత్తి పంట తడిసి ముద్ద కావడంతో వాటి ధర కూడా తగ్గి అధికంగా నష్టపోవాల్సి రావడం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే దిగుబడి తగ్గి విలవిల్లాడుతున్న

నేలవాలిన వరి పంట

పత్తి రైతులపై తుపాన్ పుండు మీద కారం చల్లినట్టయింది.

పట్టించుకోని పాలకులు..!

నష్టాల పాలవుతున్న రైతులను పలుకరించే పాలకులే కరువయ్యారు. వ్యవసాయ జూదంలో ఓడిన రైతుకు ధైర్యం చెప్పాల్సిన పాలకులు కనిపించడం లేదు. రైతులను ఆదుకుంటామనే భరోసా ఇవ్వాల్సిన అధికార పార్టీ నాయకులు, రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేయాల్సిన ప్రతిపక్ష నాయకులు దూరంగా ఉంటున్నారు. రైతులను ఆదుకోవాలని, పంటకు మద్దతు ధర కల్పించాలని రైతుసంఘం నాయకులు పోరాడుతున్నా అధికారుల్లో చలనం కనిపించడం లేదు.

దిగుబడి తగ్గింది

- రైతు పీరుసాబ్, కౌతాళం

ఈ ఏడాది అధిక వర్షాల వల్ల పత్తి పంట దిగుబడి బాగా తగ్గింది. గతేడాది ఎకరాకు 13 కింటాళ్ల పత్తి దిగుబడి రాగా, ఈ ఏడాది ఐదు నుంచి ఆరు క్వింటాళ్లు మాత్రమే వచ్చింది. దిగుబడి తగ్గడంతో వ్యవసాయానికి పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదు.

రైతులకు పంట నష్టపరిహారం ఇవ్వాలి

- రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య

అధిక వర్షాలతో పత్తి, వరి, మిరప, ఉల్లి పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలి. ప్రభుత్వం రైతులను ఆదుకోకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తాం.

మాట్లాడుతున్న కుడా ర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు

ప్రభుత్వ ఆదాయానికి గండికొడితే చర్యలు

- కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - హోళగుంద

అనుమతి లేకుండా వెంచర్లు వేసి ప్రభుత్వ ఆదాయానికి గండికొడితే కఠిన చర్యలు తప్పవని కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు హెచ్చరించారు. గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి రాజశేఖర్ గౌడ్‌తో మాట్లాడారు. గ్రామాల్లో 15 అక్రమ లే అవుట్లను గుర్తించామని, తక్షణమే వీరంతా కుడా నుంచి అనుమతులు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. లేకపోతే వెంచర్లలో నిర్మించిన ఇళ్లను కూల్చివేస్తామని హెచ్చరించారు. ప్రజలు కొనుగోలు చేసే ముందు ప్రభుత్వం అనుమతులు ఉన్నాయో లేదో తెలుసుకోవాలని సూచించారు. నాన్ లేఅవుట్లలో రోడ్లు, వీధి లైట్లు, డ్రెయినేజీలు నిర్మించబోమన్నారు. రియల్టర్లు పంచాయతీ అధికారులను బెదిరిస్తున్నారని, ఇది పద్ధతి కాదని తెలిపారు.

ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్ మృతి

ప్రజాశక్తి - చిప్పగిరి

అంపయ్య (ఫైల్)

మండలంలోని నగరడోన గ్రామానికి చెందిన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ అంపయ్య (42) అనారోగ్యంతో మృతి చెందారు. ఉపాధి హామీ చట్టంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా చిప్పగిరి, మద్దికెర ప్రస్తుతం ఆస్పరిలో విధులు నిర్వహించేవారు. అనారో గ్యంతో బుధవారం కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఉపాధి హామీ అధికారులు గురువారం నగరడోన గ్రామానికి చేరుకుని అంపయ్య మృతికి నివాళులర్పించి, ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. అంపయ్యకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. అంపయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుని ఆయన భార్యకు ఉద్యోగం ఇవ్వాలని గ్రామస్తులు కోరారు.

పాత భవనాల్లో జాగ్రత్తలు అవసరం

- తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్

ప్రజాశక్తి - చిప్పగిరి

వర్షాలు ఎక్కువగా కురుస్తున్న నేపథ్యంలో ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన ప్రభుత్వ భవనాలు, పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్ సూచించారు. గురువారం చిప్పగిరి ఎస్సీ కాలనీలోని 3వ అంగన్వాడీ కేంద్రానికి వెళ్లి పరిశీలించారు. అలాగే అంగన్వాడీ కేంద్రం భవనం గురించి, అంగన్వాడీ కేంద్రంలో రికార్డులు, చిన్నపిల్లలకు అందుతున్న భోజనాల గురించి అంగన్వాడీ టీచర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో పాత ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాలు, అంగన్వాడీ కేంద్రాల్లో పైకప్పులు భద్రంగా లేకపోతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అలా ఉన్న వాటి గురించి ఉన్నతాధికారులకు తెలియజేస్తామని అన్నారు. రెవెన్యూ కార్యదర్శి గోవిందప్ప, అటెండర్ రామాంజనేయులు పాల్గొన్నారు.

ఎస్సీ కాలనీ అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్

ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి - ఆదోని రూరల్ : జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు, గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులుగా ప్రమోషన్ పొందిన ఉపాధ్యాయులకు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా, సహాయకులుగా ప్రమోషన్ పొందిన మొత్తం 67 మంది ఉపాధ్యాయులను గురువారం ఆదోని మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎపిటిఎఫ్ నాయకులు సన్మానించారు. ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి రంగన్న, రాష్ట్ర కార్యదర్శి రవి కుమార్, పూర్వ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘురామయ్య, ఎంఇఒలు భూపాల్ రెడ్డి, శ్రీనివాసులు, నాయకులు భీమారెడ్డి, మల్లికార్జున, ముత్తన్న హాజరయ్యారు.

ఘనంగా ప్రభాస్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - ఆదోని

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ 46వ పుట్టినరోజు వేడుకలను గురువారం ఆదోనిలో అభిమానులు ఘనంగా నిర్వహించారు. భారీ కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకుంటూ సంబరాలు చేసుకున్నారు. ప్రభాస్ వీరాభిమాని డార్లింగ్ ఉదయ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ మహిళా శిశు ఆస్పత్రిలో గర్భిణులు, బాలింతలకు పాలు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ప్రభాస్ అభిమాన సంఘం నాయకులు గోపి, తరుణ్, వీర, ఉదయ్ కుమార్, అలీ ఉన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ చేసిన అభిమానులు

మెడికల్ కళాశాల కోసం ఉద్యమం

- ప్రజలు కలిసి రావాలి
- మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని మెడికల్ కళాశాల ప్రయివేటుపరం కాకుండా అడ్డుకునేందుకు ప్రజలు ఉద్యమాలకు సంసిద్ధం కావాలని మాజీ ఎమ్మెల్యే, వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ వై.సాయిప్రసాద్‌రెడ్డి కోరారు. గురువారం పట్టణంలోని ఆర్‌టిసి బస్టాండ్ ముందు ఆ వార్డు కౌన్సిలర్ చలపతి అధ్యక్షతన మొదలైంది. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, మున్సిపల్ ఛైర్మన్ లోకేశ్వరి కోటి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు మెరుగైన వైద్యం అందించేందుకు అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మెడికల్ కళాశాలలు తీసుకొచ్చారని తెలిపారు. మెడికల్ కళాశాలలు ప్రయివేట్‌పరం కాకుండా ఆయా ప్రాంతాల ప్రజలే అప్రమత్తం కావాలని కోరారు. ప్రభుత్వ వైద్య విద్యను కాపాడే బాధ్యత తీసుకోవాలని తెలిపారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ మాట్లాడుతూ... మెడికల్ కళాశాల మాత్రమే కాదని, అన్ని వసతులతో కూడిన ఆస్పత్రి కూడా అందుబాటులోకి వస్తుందని తెలిపారు. మున్సిపల్ ఛైర్మన్ లోకేశ్వరి మాట్లాడుతూ... మెడికల్ కళాశాలలను మరింత బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం ప్రయివేట్‌కు అప్పగించి చేతులు దులుపుకోవడం చేతకానితనానికి నిదర్శనమని దుయ్యబట్టారు. నాయకులు చంద్రకాంత్ రెడ్డి, దేవదాసు, దేవా, ఫయాజ్, సన్నీ, ఏసోబు, రామలింగేశ్వర యాదవ్, బాలాజీ, వెంకటేశ్వర రెడ్డి, తిమ్మప్ప, నారాయణ, చిరు, మధు, శ్రీలక్ష్మి ఉన్నారు.

న్యాయవాదుల సంఘీభావం : వైసిపి చేపట్టిన కోటి సంతకాల సేకరణకు ఆదోని న్యాయవాదులు సంఘీభావం తెలిపారు. వైసిపి లీగల్ సెల్ అధ్యక్షులు సురేంద్రబాబు, న్యాయవాదులు జీవన్ సింగ్, మాజీ ఎజిపి అంజనప్ప, విరుపాక్షి రెడ్డి, నాగరాజు, తరుణ్, నవీన్ ఉన్నారు.

ఎమ్మిగనూరు పట్టణంలోని శిల్పా ఎస్టేట్ వద్ద వైసిపి కార్యాలయం సమీపంలో వైసిపి ఇన్‌ఛార్జీ, మాజీ ఎంపీ బుట్టా రేణుక, వైసిపి సీనియర్ నాయకులు బుట్టా శివ నీలకంఠ ఆధ్వర్యంలో 'రచ్చబండ, కోటి సంతకాల సేకరణ'ను ప్రారంభించారు. కెఆర్.మురహరి రెడ్డి, బిఆర్.బసిరెడ్డి, కెవి.కృష్ణారెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ డి.నజీర్ అహ్మద్, వైసిపి పట్టణ అధ్యక్షులు కామర్తి నాగేశప్ప, బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి విరుపాక్షి రెడ్డి, రాష్ట్ర సాంస్కృతిక విభాగం ప్రధాన కార్యదర్శి రాజారత్నం, కార్యదర్శి కాశీ రెడ్డి, జిల్లా కార్యదర్శి టికె.బందేనవాజ్, జిల్లా అధికార ప్రతినిధి కదిరికోట సునీల్ కుమార్, జిల్లా మైనార్టీ విభాగం ఉపాధ్యక్షులు మహబూబ్ బేగ్, జిల్లా చేనేత అధ్యక్షులు ఎంకె.శివ ప్రసాద్, బాబా ఖాన్, అగ్రహారం నాగిరెడ్డి, సావిత్రమ్మ, జి.చిన్న, సోమేష్, వెంకటేశ్వర్ రెడ్డి, మాచాని సోమేష్, ప్రభాకర్, మీసాల బండ శివ నీలకంఠ, డిష్ కేశవ రెడ్డి, అంపమ్మ, సుధాకర్, బి.బజారి రెడ్డి, కోటకొండ నరసింహులు, గడ్డం అంజి, గురవ మాబాష, జేరుబండి రఘువీరా, రసూల్, శ్రీధర్ రెడ్డి, లతా రెడ్డి, యూసుఫ్, హుస్సేన్, చేనేత మల్లి, నరసన్న, మణి, సోమేష్, సయ్యద్, గంగులపాడు శ్రీనివాస్ రెడ్డి, పామయ్య, పాల శ్రీనివాసరెడ్డి, వడ్డే వీరేష్, బి.బసిరెడ్డి, మధు బాబు, కిరణ్, హనీఫ్, ఇబ్రహీం, వేణు, నరసింహులు, నాయక్, ఎమ్‌డి.షరీఫ్, కదిరికోట రాజ్ కుమార్, జశ్వంత్ పాల్గొన్నారు.

ఆదోనిలో సంతకాల సేకరణ చేపడుతున్న నాయకులు

ఎమ్మిగనూరులో సంతకాల సేకరణను ప్రారంభిస్తున్న బుట్టా రేణుక

సర్వసభ్య సమావేశంలో రగడ

- విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న 'రెయిన్‌బో' : ఎంఇఒ గోవిందు
- నీరివ్వాలని ప్రాధేయ పడుతున్నా స్పందించరా..? : ఎంపిటిసి శంకరమ్మ
- అధికారుల నిర్లక్ష్యం వల్లే రోడ్డు ప్రమాదాలు : ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి - నందవరం

మండలంలో నెలకొన్న సమస్యలపై అధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య రగడ చోటు చేసుకుంది. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ పుల్లయ్య ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపిపి లక్ష్మీదేవమ్మ అధ్యక్షత వహించారు. విద్యుత్ అధికారులు, పంచాయతీ కార్యదర్శుల నిర్లక్ష్యం వల్ల పంచాయతీలకు విద్యుత్ భారం పెరుగుతోందని ఎంపిడిఒ పుల్లయ్య తెలిపారు. గ్రామాల్లో ఆన్, ఆఫ్ సిస్టమ్ లేకపోవడంతో పగటిపూట కూడా వీధి దీపాలు వెలుగుతున్నాయని మండిపడ్డారు. ప్రతి వీధిలోనూ పోల్‌కు ఆన్, ఆఫ్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. ఆన్, ఆఫ్ సిస్టమ్ ఉన్న ప్రదేశాల్లో కూడా విద్యుద్దీపాలు మధ్యాహ్నం కూడా వెలుగుతున్నాయని, వాటిని నియంత్రించడంలో పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం వహించడం సరైనది కాదని చెప్పారు. విద్యుత్ అధికారి నాగేంద్ర మాట్లాడుతూ... మండలంలో ప్రజలకు ఇబ్బంది కలుగకుండా సేవలందిస్తున్నామని తెలిపారు. శిశు సంక్షేమ అధికారి గుణశేఖరమ్మ మాట్లాడుతూ... మహిళల ఆరోగ్య అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా మహిళలకు, పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్నామని చెప్పారు. మనిషి ఆరోగ్యవంతంగా జీవించడానికి వైద్యంతో పాటు పౌష్టికాహారం కూడా ముఖ్యమని తెలిపారు. కర్నూలు నగరం సమీపంలో ఉన్న పెద్దపాడు వద్ద శిశు దత్తత కేంద్రాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పిల్లలను దత్తత తీసుకోవచ్చని చెప్పారు. ఆ కేంద్రంలో చాలామంది అనాథ పిల్లలు ఉన్నారని, దత్తత తీసుకుని వారిని ఆదుకోవాలని కోరారు. పశుసంక్షేమ శాఖాధికారి నరేంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ... మండలంలోని నాగలదిన్నె, ముగతి పశువైద్యశాలలు ప్రమాదకరంగా ఉన్నాయని, వాటి నిర్మాణానికి అధికారులకు ప్రతిపాదనలు పంపామని తెలిపారు. వైద్యాధికారి బలరాం మాట్లాడుతూ... గ్రామంలోనూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలందిస్తున్నామని తెలిపారు. వైద్యాధికారుల నిర్లక్ష్యం వల్ల మండలంలో ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని ప్రజాప్రతినిధులు మండిపడ్డారు. ఆరోగ్య పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించడంలో వైద్యాధికారులు పూర్తిగా విఫలం చెందారని తెలిపారు.

ఆర్అండ్‌బి అధికారి, ప్రజాప్రతినిధి మధ్య వాగ్వాదం

విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న 'రెయిన్‌బో'

నందవరం గ్రామంలోని రెయిన్‌బో ప్రయివేటు పాఠశాల యాజమాన్యం విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతోందని ఎంఇఒ గోవిందు తెలిపారు. పాఠశాల యజమాన్యంపై విద్యార్థి సంఘం నాయకులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారని చెప్పారు. పాఠశాలను తాను పరిశీలించానని, విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయని తెలిపారు. వందల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని, పాఠశాల కూడా రేకుల షెడ్డులో నిర్మించారని చెప్పారు. పొరపాటున విద్యుత్ తీగలు పడితే విద్యార్థుల ప్రాణాలు పోయే ప్రమాదం ఉందని తెలిపారు. వాటిని త్వరగా తొలగించాలని విద్యుత్ అధికారిని కోరారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలోనూ ఆర్ఒ ప్లాంట్లు ప్రారంభమయ్యేలా కృషి చేస్తామన్నారు. పాఠశాలలో ఎన్ని ఆర్ఒ ప్లాంట్లు నిలిచిపోయాయో నివేదిక ఇవ్వాలని ఎంపిడిఒ కోరారు.

నీరివ్వాలని ప్రాధేయపడినా స్పందించరా..?

గ్రామానికి తాగునీరు అందించాలని ప్రాధేయపడినా స్పందించరా అని జగ్గాపురం ఎంపిటిసి శంకరమ్మ మండిపడ్డారు. ఎంపిటిసిగా ఎన్నికైన రోజు నుంచి ఇప్పటివరకు ప్రతి సమావేశంలోనూ గ్రామంలో ఉన్న తాగునీటి సమస్యపై అడుగుతూనే ఉన్నానని, కొన్ని నెలల్లో తన పదవి కాలం కూడా ముగుస్తుందని తెలిపారు. ఇప్పటివరకు అధికారులు స్పందించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. తనను గెలిపించిన ప్రజలకు సమాధానం చెప్పలేకపోతున్నానన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి బాలకృష్ణ మాట్లాడుతూ... పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం వల్ల కాలయాపన జరిగిందని తెలిపారు. నందవరంలోనూ నీటిని సరఫరా చేసే పైపులైన్ పూర్తిగా దెబ్బతినిందని, వాటిని మార్చి కొత్తవి నిర్మిస్తామని చెప్పారు.

ఆర్అండ్‌బి అధికారి నిర్లక్ష్యం వల్ల రోడ్డు ప్రమాదాలు

ఆర్అండ్‌బి అధికారుల నిర్లక్ష్యం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి మరణాలు సంభవిస్తున్నాయని ప్రజాప్రతినిధులు మండిపడ్డారు. ఆర్అండ్‌బి అధికారి మాట్లాడుతూ... మండలంలో రోడ్డు పరిస్థితి దుర్భరంగా ఉన్న మాట వాస్తవమేనని నవ్వుతూ సమాధానం ఇచ్చారు. 'ప్రజల ప్రాణాలంటే నీకు నవ్వులాటగా ఉందా' అని ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎటు చూసినా రోడ్లు గుంతలు పడి ఉన్నాయని, నిత్యం ప్రమాదాలు జరుగుతూ ఉన్నాయని తెలిపారు.

శ్మశాన వాటికకు ఎకరా భూమి విరాళం

- దాతృత్వం చాటుకున్న మాజీ సర్పంచి గోపాల్ రెడ్డి

ప్రజాశక్తి - ఆస్పరి

రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేస్తున్న మాజీ సర్పంచి

మండలంలోని తంగరడోన గ్రామంలో శ్మశానవాటిక లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలను చూసి రూ.20 లక్షల విలువైన ఎకరా భూమిని మాజీ సర్పంచి గోపాల్ రెడ్డి శ్మశానానికి విరాళం అందజేసి ఔదార్యం చాటుకున్నారు. గురువారం ఆస్పరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గ్రామ పెద్దల సమక్షంలో రిజిస్ట్రేషన్ చేయించారు. వారు మాట్లాడుతూ... సర్పంచిగా ఉన్నప్పుడు గ్రామానికి నాగనాథనహళ్లి ఎస్ఎస్ ట్యాంకు నుంచి వచ్చే నీటిని సాదాపురం పంపుహౌస్ ద్వారా పైపులైన్ వేసి గ్రామానికి అందించామని తెలిపారు. గ్రామంలో సిసి రోడ్లు, డ్రెయినేజీ వేసి సమస్య లేకుండా చేశామని చెప్పారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి వేణు గోపాల్ రెడ్డికి రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేశారు. విశ్రాంత విఆర్ఒ సీతారామి రెడ్డి, సీనియర్ జర్నలిస్టు వెంకన్న, ఎంపిటిసి నరసన్న, గ్రామ పెద్దలు రంగన్న, కృష్ణమూర్తి, వెంకటేష్, ముని స్వామి, హాతీఫ్, లింగమయ్య, నాగేంద్ర కృతజ్ఞతలు తెలిపారు.

సిద్ధాపురం రోడ్డు నిర్మించాలి : సిపిఎం

ప్రజాశక్తి - హాలహర్వి

మండలంలోని సిద్ధాపురం నుంచి గూళ్యం వరకు రోడ్డును వెంటనే నిర్మించాలని సిపిఎం నాయకులు కోరారు. గురువారం సిద్ధాపురం సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ... బల్లూరు, సిద్ధాపురం గ్రామాల ప్రజలు బళ్లారి, ఆదోని వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అలాగే సిద్ధాపురం గ్రామంలో సుంకలమ్మ దేవాలయం దగ్గర సిసి రోడ్డు ఏర్పాటుచేయాలని కోరారు. సిపిఎం మండల కార్యదర్శి కె.కృష్ణ, నాయకులు వీరేష్, సిద్ధప్ప, జడెప్ప, లింగయ్య, గంగాధర్, బోయ లేపాక్షి, చంద్రన్న పాల్గొన్నారు.

అవిశ్వాస తీర్మానం మినిట్స్ బుక్ ఇవ్వండి

- ఇన్‌ఛార్జీ ఎంపిడిఒపై మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ మండిపాటు

ప్రజాశక్తి - ఆదోని రూరల్

ఎంపిపి అవిశ్వాస తీర్మాన మినిట్స్ బుక్ ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ డిమాండ్ చేశారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌ఛార్జీ ఎంపిడిఒ జనార్దన్‌ను కలిసి అవిశ్వాస తీర్మానం సందర్భంగా రూపొందించిన సభా సమావేశ మినిట్స్ బుక్ ఎక్కడుందో వివరించాలని తెలిపారు. వారు మాట్లాడుతూ... అధికార పార్టీ నాయకులకు వత్తాసు పలుకుతున్నారని, మినిట్స్ బుక్ జిరాక్స్ కాపీలు ఇవ్వాలని కోరారు. 'ఇది సబ్ కలెక్టర్ పరిధిలో ఉంద'ని ఎంపిడిఒ చెబుతున్నారని, రాతపూర్వకంగా చెప్పాలని పట్టుబట్టారు. ఇన్‌ఛార్జీ సబ్ కలెక్టర్ కేవలం ఎంపిడిఒ ఆధ్వర్యంలో సమావేశానికి మాత్రమే హాజరయ్యారని గుర్తుచేశారు. ఎంపిడిఒ జనార్ధన్ మాట్లాడుతూ... ఇవ్వవద్దని సబ్ కలెక్టర్ నుంచి ఆదేశాలు వచ్చాయని సమాధానం ఇచ్చారు. అధికారులను ఒత్తిడికి గురి చేసి అవిశ్వాసం వీగిపోయేలా చేయడం తమ పార్టీ సిద్ధాంతం కాదన్నారు. అది కూటమి నాయకులకే చెల్లుతుందన్నారు. చట్టపరంగా, న్యాయపరంగా ఎదుర్కొంటామని తెలిపారు.

శ్రీమఠంలో ఘనంగా స్వర్ణ పల్లకోత్సవం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్రస్వామి మఠంలో రాఘవేంద్రుని స్వర్ణ పల్లకోత్సవం వైభవంగా సాగింది. గురువారం శ్రీమఠం దివాన్ జికె.ఆచార్, సహాయక పిఆర్ఒ హొన్నాళ్లి వ్యాసరాజాచార్, పూజారులు వేద వ్యాసరాజాచార్ ఆధ్వర్యంలో స్థానిక శ్రీమఠంలోని పూజా మందిరంలో సేవాదారుల సమక్షంలో రాఘవేంద్రుని బృందావన ప్రతిమకు విశేష పూజలు నిర్వహించారు. మంగళహారతులు ఇచ్చి, అనంతరం బృందావన ప్రతిమను స్వర్ణ పల్లకిలో ఉంచి మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ శ్రీమఠం ప్రాకారంలో ఘనంగా పల్లకోత్సవం నిర్వహించారు. అనంతరం పీఠాధిపతులు సుభుదేంద్రతీర్థులు ఫల మంత్రాక్షతలు అందజేసి ఆశీర్వదించారు.

భక్తుల కోలాహలం : శ్రీరాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో శ్రీమఠంలో కోలాహలం నెలకొంది. స్వామివారి దర్శనార్థమై దేశ నలుమూలల నుంచి వచ్చిన భక్తులు గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొనేందుకు బారులు తీరారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఒక్కో భక్తునికి పరిమళ ప్రసాద ప్యాకెట్లను కేవలం రెండు చొప్పున విక్రయించడంతో భక్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు. శ్రీమఠం నిర్వహణలో ఉన్న శ్రీఅన్నపూర్ణ భోజనశాలలో భక్తులకు ఉచిత ప్రసాద వితరణ చేపట్టారు.

కనువిందు చేసిన కూచిపూడి : మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్ర స్వామి మఠంలో కూచిపూడి నాట్యం భక్తులకు కనువిందు చేసింది. శ్రీమఠంలో కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు నృత్య దిశా ట్రస్ట్ ఆర్గనైజర్ డాక్టర్ దర్శిని మంజునాథ్ ఆధ్వర్యంలో కూచిపూడి నాట్యం చేశారు. రాఘవేంద్ర స్వామి భక్తిగీతాలకు సాంప్రదాయక నృత్యాలు చేస్తూ చూపరులను ఆకట్టుకున్నారు.

ఉద్యోగ ప్రకటన

సునిత ఎయిడెడ్ అప్పర్ ప్రైమరీ స్కూల్
జొహరాపురం, కర్నూలు-518002
ఆర్.సి.నెంబర్ 1400/బి4/2025 తేది : 29.09.2025

కర్నూలు జిల్లా డీఈవో వారు మా పాఠశాలకు కింద పేర్కొనబడిన ఖాళీగా ఉన్న ఎయిడెడ్ పోస్టులు భర్తీ చేయుటకు అనుమతి ఇచ్చి ఉన్నారు. కనుక అర్హత గల అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నాము. దరఖాస్తు నకలతో పాటు ఉపాధి నమోదు పత్రం జతపరచవలెను. https//cse.ap.gov.in/aided Recruitment Notification

ఖాళీ పోస్టుల వివరాలు

క్ర.స	పోస్టువివరాలు	ఖాళీల సంఖ్య	రోస్టర్ పాయింట్ నెంబర్
1.	SGT S	4	6.OC, 7-SC- Group-II as per the GOMS no.7 dated : 18.04.2025 8-S.T. 9-OC

ఎంపిక విధానం (1) డిపార్ట్మెంట్ నామినిచే ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక చేయబడును. (2) వయోపరిమితి ప్రభుత్వం నిబంధనలకు లోబడి ఎంపిక చేయబడును. (3) ప్రభుత్వ నిబంధనల మేరకు విద్యార్హత కలిగి ఉండాలి. (4) టెట్ పాస్ అయిన అభ్యర్థులు మాత్రమే అర్హులు

దరఖాస్తు చేసుకోవలసిన చివరి తేది.24.11.2025

ఇట్లు : **పెరుమాళ్ళ సాలోమోను**, BA., BEd, కరస్పాండెంట్

ఉపాధి కల్పిస్తాం.. వలసలు వెళ్లొద్దు

- ఏపీవో రాజు నాయక్ - ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - దేవనకొండ

గ్రామాల్లోని వ్యవసాయ కూలీలకు ఉపాధి పనులు కల్పిస్తామని, వలసలు వెళ్లొద్దని ఉపాధి ఏపీవో రాజు నాయక్ కోరారు. 'ప్రారంభమైన వలసలు' అనే శీర్షికన ప్రజాశక్తి దినపత్రికలో గురువారం ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఏపీవో రాజు నాయక్ ఉపాధి హామీ సిబ్బందితో కలిసి మండలంలోని గుడిమిరాళ్ల గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు నారాయణ, దేవేంద్ర, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న ఏపీవో

పరిశ్రమలపై అవగాహన అవసరం

- ప్రధానోపాధ్యాయులు నాగభూషణంరెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పరిశ్రమలపై విద్యార్థులకు అవగాహన అవసరమని ఎమ్మిగనూరు వీవర్స్ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగభూషణం రెడ్డి, ఒకేషనల్ ట్రైనర్ సివి.శ్రీహరి తెలిపారు. గురువారం 9, 10వ తరగతి విద్యార్థులకు ఇండస్ట్రీయల్ విజిట్‌లో భాగంగా కలుగొట్ల రోడ్డులోని అమరావతి ఆయిల్ మిల్స్‌లో వివిధ నూనెల గురించి వివరించి అలాగే ప్యాకింగ్‌కు సంబంధించి ప్రత్యక్షంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈరన్న, ఒకేషనల్ ట్రైనర్లు వంశీ, వెంకటలక్ష్మి, పిఇటి శ్యామ్ సుందర్ పాల్గొన్నారు.

బ్యాంకు ఖాతా నెంబర్ల మార్పునకు ఇక్కట్లు

ప్రజాశక్తి - దేవనకొండ

ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు విలీనంతో ఖాతాదారుల ఖాతా నెంబర్లు మారాయి. ఖాతా నెంబర్ల మార్పునకు ఖాతాదారులు భారీగా తరలి రావడంతో గురువారం దేవనకొండ ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు కిక్కిరిసింది. ఖాతా నెంబర్లు మార్చుకోవడానికి ఖాతాదారులు ఇక్కట్లకు గురయ్యారు. ఈనెల 9 నుంచి 13 వరకు గ్రామీణ బ్యాంకు ఖాతాదారుల లావాదేవీలు కూడా నిలిపేసిన విషయమే తెలిసిందే. గతంలో ఉన్న బ్యాంకు ఖాతా నెంబర్లు మార్చుకోవాలని బ్యాంకు అధికారులు తెలియజేయడంతో ఒక్కసారిగా ఖాతాదారులు తండోపతండోలుగా తరలివచ్చారు. ఖాతాదారులతో బ్యాంకు కిటకిటలాడింది. ఖాతా నెంబర్ల మార్పునకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని ఖాతాదారులు కోరుతున్నారు.